


-కల్లూరి భాస్కర్

బస్సు ఇంకా కదలలేదు. తను గంటసేపయింది వచ్చి కూర్చుని. మన దేశంలో బస్సులన్నా, రైళ్ళన్నా చూసి విసిగి వేసారి కాలచక్రమైనా తన గమనాన్ని దిద్దుకోవాలి గానీ, అవిమాత్రం మారవు అంటూ విసుక్కున్నాడు విజయ సారథి. ఎవరెవరో అడపా తడపా వచ్చి ఎక్కుతున్నారు బస్సులో.

ఒళ్ళో ఉన్న బాగ్‌ని ఒకసారి కుదురుగా సర్దుకొని కిటికీలోంచి చూస్తూ దీర్ఘమైన ఆలోచనలో పడ్డాడు సారథి. ఈ ఏడాది నుంచీ బ్రతుకు మరీ బరువుగా నడుస్తూంది. ఉద్యోగంకోసం ఎన్ని ఇంటర్వ్యూలో చూశాడు. అర్హతైతే



పొట్టుపోదా పొట్టుందీ...

చిత్రం—సి. మురళీ మోహన్

ఉంది కానీ, ఉద్యోగం ఏదీ? బహుశా చదువుకీ, ఉద్యోగ జీవితానికీ మధ్య ఈ నిరుద్యోగమనే నరకం కొంతకాలం అనుభవించాలి కాబోలు! తనసలు ఈ తెలుగెందుకు చదివాడు? అమ్మ వద్దని పోరుతూనే ఉంది. నిజమే. అమ్మ మాట విని ఏ సైన్సో, లెక్కలో తీసుకునుంటే తనకు అనేక రకాలైన ఉద్యోగాలలో అవకాశం ఉండేది. తెలుగు చదివినందువల్ల కేవలం బడిపంతులే కావాలి. తను చదవకపోయినా బాగుండేదేమో?

అప్రయత్నంగా వచ్చిన ఈ ఊహకు వెంటనే బాధపడ్డాడు సారథి. తనను తెలుగు చదువులోకి ఆకర్షించిన మహత్తర శక్తి ఎవరు? మాస్టారు. సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. ఆయన ఉపన్యాస ప్రసంగాలు, పద్యం చదివినప్పుడు ఆ కంఠంలో తీగలు సాగే అవ్యక్త రాగధార, సాహిత్య కవితా చర్చలు విని తను చిన్నతనంలో ముగ్ధుడైపోయేవాడు. త నెలాగైనా తెలుగు సాహిత్యం చదవాలనుకొనేవాడు అప్పుడు. మాస్టారు కూడా ప్రోత్సహించారు. తెలుగు లిటరేచర్ స్టూడెంటు నని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడేవాడు తను. కాలేజీ జీవితం తరవాత యూనివర్సిటీ జీవితం, కాలం నడుస్తోంది — గెంతింది. చూస్తూండగానే ఎమ్. ఎ. అయిపోయింది. గోల్డ్ మెడల్ పుచ్చుకున్నాడు. ఆ రోజుల్లో ఎప్పుడూ సాహిత్య విమర్శలూ, డిబేట్లూ, రచనలూ, బహుమతులూ, అభినందనలూ —సారథి మంచి విద్యార్థి కాదు, మంచి రచయిత కూడాను.

గతించిన జ్ఞాపకాలు అతనిని ఒకింత విషాదానందంలో ముంచేత్తాయి. అయితే నేం? ఈ సంవత్సర కాలం తను బ్రతికిన బ్రతుకు చాలు. విద్యార్థి జీవితంలోని ఆశలూ, ఆశయాలూ అన్నింటినీ ఎండ మాపుల్చి చేసింది. ఒక జీవితకాలం పోయుపేనంత విరక్తిని మిగిల్చింది.

ఇప్పుడు మళ్ళీ ఇంటర్వ్యూ! ఈ సారి ఏమవుతుందో?

గుంటూరులో ఎండలు ఎక్కువే. పదకొండు గంటలకే చెవులు గింగురుమంటున్నాయి. నిరాశా నిస్పృహాలతో మళ్ళీ మరో గ్రీష్మం చూడకూడదు అనుకుంటూ నిట్టూర్చాడు సారథి.

ఒకసారి బస్సులోకి తేరి చూసి ఆశ్చర్యపోయాడు. అరె! అన్ని సీట్లూ చూస్తూండగానే నిండిపోయాయే!

డ్రైవర్‌గానీ, కండక్టర్‌గానీ కనిపిస్తారేమోనని కిటికీలోంచి బయటికి చూశాడు.

అతని చూపులు మంత్రించినట్లు నిలిచిపోయాయి. ఆనందం, ఆశ్చర్యం ఉక్కిరి బిక్కిరి చేశా యతన్ని. మాస్టారు! సుబ్రహ్మణ్యశాస్త్రిగారు! తనిప్పుడే ఆయన గురించి తలపోశాడు. ఇంతలోనే ఆయన కనిపించారు.

మోచేతి వద్ద వేలాడుతున్న సంచీ. ఆలోచనతో పెదవి సగం నొక్కి పట్టి, ఒక చేత్తో పంచ అంచు కాస్త పైకి పట్టుకొని నెమ్మదిగా, చల్లగా నడిచి వస్తున్నారు మాస్టారు. ఎండ వేడిమికి కండువా తలమీద నుంచి చుట్టుకున్నారు. భోజనం అయినట్టు గుర్తుగా నుదుట కుంకుమా, గంధమూ — స్వేదంతో తడిశాయి. శరీరమంతా చెమటలు కారుతున్నాయి.

సారథి మనస్సు అవ్యక్తమైన భక్తి, అనుభూతులతో తియ్యబడింది. ఎన్నాళ్ళకు కనిపించారు మాస్టారు!

మాస్టారు ఎవరినో ఏదో ప్రశ్నించారు. సమాధానంగా ఆ మనిషి తల ఊపాడు.

సారథి కళ్ళు వారి అడుగులతో పేరాడుతున్నాయి. ఆయన నడిచి వస్తున్నట్లు లేదు. సరస్వతి తడబడే అడుగులతో నడిచి వస్తున్నట్లుంది. ఆయన విజ్ఞానం, మేధస్సు, అన్నింటినీ మించి కవితామృతాన్ని చిలికే ఆర్ద్ర హృదయం. వారి చూపులో, నడకలో, శరీరంలో అణువణువులో రూపు పోసుకొని జీవకళ ఒలుకుతున్నాయి.

మాస్టారు బస్సు సమీపించారు. ఫుట్‌బోర్డు మీద కాలు పెట్టారు. సారథి చిన్నగా వణుకుతూ లేచి నిలబడ్డాడు. అప్పకోలేని అనుభూతితో అతను తత్తరపడుతున్నాడు. మాస్టారు బస్సులో నిలబడి కండువాతో ముఖాన పట్టిన చెమటను తుడుచుకుంటూ ఉస్సురని నిట్టూర్చి కూర్చుండుకు చోటు వెతకసాగారు.

సారథికి సాష్టాంగ ప్రణామం చేద్దామనిపించి, రెండు చేతులూ జోడించాడు— "మాస్టారూ!" అంటూ.

ఆయన నవ్వు ముఖంతో పిలుపు వినిపించిన వైపు ప్రశ్నార్థకంగా చూశారు.

"ఇలా కూర్చోండి, మాస్టారూ!" అని తన సీటు చూపించాడు సారథి.

"అబ్బే, నువ్వు కూర్చోవోయ్. నిలబడతాను. ఫరవాలేదు" అంటూ మొహమాట పడుతున్న మాస్టార్ని బలవంతం చేసి కూర్చోబెట్టాడు సారథి.

అప్పటికిగానీ ఎండ ధాటికి వచ్చిన ఆయాసం నుంచి తేరుకోలేక పోయారాయన. కాస్సేపటికి మరల అదే ప్రశ్న గుర్తుతో చిరునవ్వు నిలుపుకొని సారథిని చూశారు.

మాస్టారి సందేహం అర్థమయింది సారథికి.

"నే నండీ సారథిని—విజయసారథి."

"సారథి!" గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నించి సాధ్యం కాక బుర్ర తడుముకుంటూ మందహాసంతో చూశారు సారథి వైపు.

"వయసుతోబాటు జ్ఞాపకశక్తి వన్నగిల్లిందోయ్. మరి కొన్ని వివరాలు చెప్పు."

"సారథినండీ. మీ దగ్గరే చదువుకున్నాను. మీ ఇంటికి వచ్చి ప్రబంధాలు, వ్యాకరణంకూడా చెప్పించుకునే వాణ్ణి."

అస్పష్టమైన ఒకానొక జ్ఞాపకం వారిలో తీగలా మెదిలింది. ముఖం సంతోషంతో విప్పారింది. "నువ్వా? సారథివా? ఎలా ఉన్నావు, బాబూ? ఏం చేస్తున్నావు? చదువయిపోయిందికదూ?" కాస్త దూరంలో నిలబడ్డ సారథిని దగ్గరగా తీసుకొనేందుకు కూర్చునే చేతులు చాచారు మాస్టారు.

సారథి దగ్గరగా జరిగాడు.

"ఎమ్. ఎ. అయిపోయిందండీ. గోల్డ్ మెడలిచ్చారు."

ఒకింత గర్వం తొంగి చూచిన అతని కంఠంలో. మాస్టారు ఆదరంగా చెయ్యి నిమిరారు. "బాగుందోయ్. చాలా సంతోషం. నా దగ్గర చదివిన వాళ్ళు పారంతట వారు వచ్చి గుర్తు చేస్తే తప్ప గుర్తుండదోయ్. అంతా నీ లాగే ఎమ్. ఎ. లు, డాక్టరేట్లు తీసుకొన్నామని చెబుతుంటే చాలా ఆనందంగా ఉంటుందోయ్." నిండైన వాత్సల్యానికి మాటలు నేర్పుతున్నట్లుంది. వారి మందహాసం. "నిలబడే ఉన్నావే?" అంటూ నొచ్చుకున్నారు.

"ఫరవాలేదండీ" అని కాస్సేపు ఆగి, "మీరు రిటైరయినట్లు విన్నాను, మాస్టారూ!" అన్నాడు సారథి.

మాస్టారు మళ్ళీ నవ్వారు. "అవునోయ్. రిటైరయ్యా నండి ప్రభుత్వం. కానీ, బాధ్యతలూ, భగవంతుడూ ఇంకా రిటైరు చెయ్యందే!"

"అబ్బాయిలు ఉద్యోగాలకు అంది కున్నారు గదండీ!"

ఆయన ముఖం ఒకింత చిన్నబోయింది. "ఏదీ? పెద్దవాళ్ళు ముగ్గురికే ఉద్యోగం, వాళ్ళ సంపాదన వారికే చాలదు. నాలుగోవాడు కాలేజీలో చదువుతున్నాడు. మిగతా ఇద్దరూ చిన్న పిల్లలూ, దీనికితోడు వివాహానికి ఎదిగిన ఆడపిల్లా . . ." అంత విరక్తినీ చిరునవ్వులోనే బంధించి అన్నారు మాస్టారు.

బ్రతుకుతో బరువులు మోసిన మాస్టారు! సారథి బాధ పడ్డాడు. ఇంకా ఆయనకు ఈ సంసార జంజాటం తప్పలేదన్న మాట! విశ్రాంతి పొందవలసిన వయస్సు. ఈ వయస్సులోనూ ఇంకా ఎండనకా, వాననకా శ్రమపడి సంసారమనే కుంటిబండిని లాగుతున్నారు.

సారథి మనస్సు సానుభూతితో బరువయింది. ఇందాక ఎండలో నడిచి వస్తున్న వారి రూపం కళ్ళముందు నిలిచింది. ఎండవేడిమికి తట్టుకోలేని, వయస్సు తెచ్చిన ఆ శారీరక దౌర్బల్యం చూసి తనకు ఏడుపొచ్చినంత పనయింది. చివరకు మాస్టారిని ఇలా చూడవలసి వచ్చింది! సారథి కంటి కొసలలో నీళ్ళు నిలిచాయి.

డ్రైవరు, కండక్టరు హడావుడిగా ఎక్కారు.

కండక్టరు టిక్కెట్లు ఇవ్వడంలో నిమగ్నమయ్యాడు. మాస్టారు లాల్చీ జేబులోంచి అయిదు రూపాయల నోటు తీసి, "సత్తెనపల్లికి ఒక టిక్కెట్టివ్వోయ్" అన్నారు.

"చిల్లర ఇవ్వవయ్యా" అంటూ విసుక్కున్నాడు కండక్టరు.

సారథికి పట్టరాని ఆగ్రహం

కలిగింది, కండక్టర్ అభిప్రాయానికి.

"మర్యాదగా మాట్లాడండి. ఆయన వెవరనుకుంటున్నారు? మహాపండితులు."

"అలాగా? మా కెలా తెలుస్తుంది? అట్టలు కట్టుకొని, రమ్మనండి తెలుస్తుంది." కండక్టరు నిర్లక్ష్యంగా సమాధాన మిచ్చి, మరొకరికి టికెట్ ఇష్యూ చేయడంలో మునిగిపోయాడు.

మాస్టారు మొదట్లో కాస్త చిన్న బుచ్చుకున్నట్లు కనిపించినా, అంతలోనే— 'అలవాటైన బ్రతుకే సోయ్' అన్నట్లుగా సారథిని చూసి నవ్వేశారు.

సారథి కండక్టరుతో వాగ్వాదం పెంచలేదు. అనవసరంకూడా. ఆయన విలువ పరిపాలకులకే తెలియదు. పండితుడూ, పామరుడూ అంటేనే అర్థం తెలియని కండక్టరు కెలా తెలుస్తుంది? ఆయనకు అకాడెమీలలో గుర్తింపు లేదు. రేడియోలు పిలవవు. విశ్వవిద్యాలయాలలో బిరుదు లిచ్చి సత్కరించరు. ఈ ప్రస్తావన ఎప్పుడైనా తెస్తే— "నా, కెందుకోయ్ బిరుదులు?" అంటూ నవ్వుతారు.

"కాదండీ, మాస్టారూ! మీకు అక్కర్లేక పోవచ్చు. కానీ మిమ్మల్ని గౌరవిస్తే తమనే గౌరవించినట్లుగా, మిమ్మల్ని సన్మానిస్తే తమనే సన్మానించినట్లుగా పొంగి పోయే మీ శిష్యుల కోసమూ, మీ అభిమానుల కోసమూ నండి" అనే వారు తాము.

కండక్టరు ఆయనను అలా సత్కరించ టంలో పొరబా టేముంది? ఆయన కట్టుకొన్న ఖద్దరు పంచె, లాల్చీ నల్లగా మాసిపోయినాయి. ముఖంలో వార్ధక్యం తెచ్చిన ముడతలు, పైకి కనిపించే అమాయకత్వం ఆయన సోషల్ స్టేటస్‌ని పెంచలేకపోయినాయి, పాపం! చేత్తో కిటికీ ఊచ పట్టుకొని పరిగెడుతున్న బస్సులోంచి బయటికి చూస్తున్నారు మాస్టారు. చేతిమీద నరాలు ఉబ్బెత్తుగా లేచాయి. మనసటి పట్టుత్వం ఎలా ఉంటుంది? మాస్టారు బాగా నీరసించారు జరాభారంతో.

ఏమిటో, ఆలోచిస్తున్నారు! బహుశా తన కింకా, మిగిలిపోయిన బాధ్యతల గురించేమో? ఇన్ని చికాకులు, చింతలు మధ్య అంత ఆర్ద్రమైన కవితాహృదయాన్ని ఎక్కడ దాచుకున్నారో మాస్టారు! సత్తెనపల్లి అన్నారు. ఆయనా తనలాగే ఇంటర్వ్యూకి కాదు గదా!

ఈ ఆలోచనకు సారథి ఒకింత త్రుళ్ళిపడి అంతలోనే సర్దుకున్నాడు.

"ఇంటర్వ్యూ కయితే తనతో చెప్పేవారు కదా?"

ఆయన సారథిని చూసి అడిగారు: "నువ్వూ, సత్తెనపల్లేనేమిటోయ్?"



మేనా

చిత్రం—ఇ. గోపాలరావు (పొన్నెకల్లు)

"అవును, మాస్టారూ! ఇంటర్వ్యూకి వెళుతున్నాను."

"ఏమిటి? శేషయ్యగారి కాలేజీకా?" మాస్టార్ కంఠంలో ఉత్సుకత కనిపించింది.

"అవునండీ. ఇది పదకొండో సారి. ఈసారైనా ఉద్యోగలక్ష్మి వరిస్తుందో, లేదో?" సారథి నిస్పృహగా నవ్వాడు.

మాస్టారు మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నారు.

సారథి మాట్లాడుతూనే ఉన్నాడు.

"ఇంక ఉద్యోగం వస్తుందన్న ఆశే హరించుకు పోతోందండీ!"

మాస్టారు మౌనం వహించారు.

"ఏ ఇంటర్వ్యూకి వెళ్ళినా రికమెండేషన్నో, లేకపోతే అనుభవం—ఇవే కావలసింది. అర్హతేవరు చూస్తారండీ?" బాధతో సుళ్ళు తిరుగుతూంది అతని గొంతు.

ఏదో అందామని ప్రయత్నించి ఎవరో నొక్కి పెట్టినట్టయింది మాస్టారికి. తల వంచుకొనే కిటికీలోంచి బయటికి చూస్తున్నారు.

"ఏరో నాట ఉద్యోగాలు చేస్తున్న వారుకూడా ఇంటర్వ్యూలకు సిద్ధమయితే ఎలాగండి? ఇందాక చూడండి. మొన్న నో పెద్దమనిషి రిటైరై, మళ్ళీ ఉద్యోగం కావాలంటూ పెద్ద రికమెండేషనుతో వచ్చాడు. మానేజ్‌మెంటువారికి కావలసింది అనుభవమూ, పేరూ. ఆయనకే ఇచ్చారు ఉద్యోగం. ఛ ఛ! పెద్దవాళ్ళే ఇలా పిల్లల భవిష్యత్తుని మింగేస్తున్నారు."

సారథికి కన్నీళ్ళు తరువాయి.

మాస్టారు తీవ్రంగా చలించారు. ఎండుటాకులా వణకసాగారు. అంతలోనే జాలిగా, నిస్సహాయంగా సారథిని చూసి ముఖం తిప్పుకొని కళ్ళు వత్తుకున్నారు. 'రిటైరయిన వాళ్ళందరినీ చచ్చిపొమ్మనో ఏమిటో వీళ్ళ ఉద్దేశ్యం? వాళ్ళూ ఉద్యోగం చేయకూడదనే అనుకుంటారు. ఏ గోదావరీ తీరంలోనో కృష్ణా, రామా అనుకుంటూ ప్రశాంతమైన జీవనం గడపాలనే కలలు గంటారు! కానీ, రాగ పాశం ఎంత అక్కర్లేదనుకున్నా పట్టి లాగుతుంది. ఎదుగుతున్న పిల్లలు... వాళ్ళ కింత భవిష్యత్తు కల్పించవలసిన కన్నతండ్రి బాధ్యత. ఆడపిల్లలకు కన్నెచెర వదిలించవలసిన కర్తవ్యం. అన్నీ కాగా తనకు, తన భార్యకు ఇంత తిండి గడిచే బ్రతుకుతెరువు...

"మాస్టారూ!" అంటున్న సారథి పిలుపుకు ఈ లోకంలోకి వచ్చి తల ఎత్తారు మాస్టారు. తేజస్సుతో వెలిగే ఆ నేత్రా

ఒదో ఏ మూలో చిరు చీకటి నిండింది.

సారథి బాగ్‌లోంచి ఏవో పత్రిక లాలూకు కత్తిరింపులు తీసి ఆయనకు అందించాడు. అతని కళ్ళు ఆనందంతో మెరుస్తున్నాయి.

"మాస్టారూ! ఇవి నా ప్రయోజకత్వం, మాస్టారూ! శ్రీనాథుని కవిత్వం మీద నా పరిశోధనకు సంబంధించిన విమర్శలు."

"అలాగా!" అంటూ మాస్టారు వాటిని అందుకొని, లాల్చీ జేబులోంచి కళ్ళజోడు తీసుకొని తగిలించుకొని చూడ డంలో నిమగ్నమయ్యారు. కాస్సేపటికి వాటిని సారథి చేతికిస్తూ, "బాగున్నా యోయ్. నీ పరిశోధన లోని ప్రధానాంశం నాకు నచ్చింది. శ్రీనాథుని వ్యక్తిత్వం లోని విశిష్టతను చక్కగా గుర్తించావు" అంటూ దేని గురించో ఆలోచనలో పడ్డారు.

సారథి వాటిని తిరిగి తన బాగ్‌లో పెట్టుకున్నాడు.

"మాస్టారూ! ఇదంతా మీరు పెట్టిన భిక్ష, మాస్టారూ!" సారథి కళ్ళు చెమ్మ గిల్లాయి.

మాస్టారు తల పంకించారు. కొద్ది సేపు మౌనంగా గడిచింది.

"ఇవికూడా నా అర్హతను పెంచి నాకు ఉద్యోగం దక్కించ లేకపోతున్నాయి." సారథి మళ్ళీ నిరాశలో మునిగాడు. "అసలు ఈ తెలుగు చదవకపోయినా బాగుండేది."

ఆ మాట విని భరించలేనట్లు కళ్ళు మూసుకున్నారు మాస్టారు. "సరస్వతి అనుగ్రహానికి పాత్రుడి వయావు. అదృష్టవంతుడివి. అలా ఆ మాట అనకూడదు, సారథీ!" అన్నారు కష్టం మీద గొంతు పెగుల్చుకుని.

"అదృష్టమేమోనండీ. . . ఇంక భవిష్యత్తు మీద ఆశ సన్నగిల్లిపోయింది. రోగంతో మంచం పట్టిన అమ్మకు ఏం సమాధానం చెప్పను? చదువు కెదిగిన తమ్ముళ్ళకు ముఖ మెలా చూపించను? చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు ఎలా జరిపించను? వెనక ఆస్తి లేదు. అందినంత వరకూ అమ్మ డబ్బంతా నా చదువుకే తగల బెట్టింది. ఎందుకు? నే నేదో ఉద్యోగం చేసి ఉద్ధరిస్తానని. బ్రతుకంటే ఈ ఒక్క సంవత్సరంలోనే అర్థమయింది, మాస్టారూ! మనిషికి కావలసింది విజ్ఞానమూ కాదు, వివేకమూ కాదు. తిండి, సమస్యలు లేని జీవితం! వాస్తవం ఇంత చేదుగాను, ఊహ తియ్యగాను సృష్టించడంలో దేవుడు మనిషి మీద తన కుస్పంత కసినీ తీర్చుకున్నాడు."

మాస్టారు ఇంక వినలేకపోయారు. మనిషికి కావలసింది విజ్ఞానం కాదు అంటున్న సారథి మాటలు వారి హృదయంలో ముల్లులా గుచ్చుకున్నాయి. 'ఎంత తెలివైన వాడు ఎటువంటి ఆలోచ నకు దిగజారాడు!' మీరు పెట్టిన భిక్ష, మాస్టారూ, అంటున్న సారథి పరోక్షంగా తను నమ్మిన చదువుని గేలి చేస్తున్నట్లు ఊహించుకొని బాధ పడ సాగా రాయన.

బస్సు ఏదో ఊళ్ళో ఆగింది. ఎవరెవరో దిగారు. ఖాళీ అయిన చోటు చూపించి, సారథిని కూర్చోమని బలవంత పెట్టారు మాస్టారు. సారథి వెళ్ళి కూర్చున్నాడు—'మాస్టారుకి ఇవన్నీ చెప్పి బాధ కలిగించానేమో?' అనుకుంటూ.

మాస్టారు పరుగెత్తే ప్రకృతిని అవలోకిస్తూ కూర్చున్నారు. వారిలో అనేక ఆలోచనలు మబ్బుల్లా వ్యాపించి విడిపోతున్నాయి. సారథి కోలుపోయిన ఉత్సాహం మళ్ళీ పుంజుకోవాలి. బతుకు మీద, భవిష్యత్తు మీద కొత్త కొత్త ఆశలు పెంచుకోవాలి. మామూలు మనిషి కావాలి. ఎన్నో సాధించాలి. అందుకు ఏం చేయాలి?

వారిలోని వాత్సల్యం ఇసుక గూళ్ళు కడుతూంది.

తనలా జీవితం చివరి అంచు మీద ఉన్నవాళ్ళు, ఓపినంతలో కొంతైనా అనుభవం, కొన్నైనా ఆశయాలు సాధించగలిగిన వాళ్ళు తప్పుకోవడమే మంచిది. సారథి లాంటి వాడు మంచి పేరు తెచ్చుకొని ఫలానా వారి శిష్యు లనిపించుకొంటే తమ బోటి వాళ్ళ కా తృప్తి చాలదూ?

కానీ అంతలోనే వారి కళ్ళముందు జీవంలేని కళ్ళలో కొత్త ఆశలు నింపు కొన్న భార్య అనసూయ, 'కన్నందుకు మా జీవితాల కొక అర్థం కల్పించు' అంటూ ఆజ్ఞాపిస్తున్న పిల్లల చూపులు కదలసాగాయి. ఇంతవరకూ వారు పెంచు కున్న తృప్తి పెనుగాలికి దూదిపింజలా ఎగిరిపోయింది. దారితోచని భావ సంఘ ర్షణలో నలిగిపోతూ, భగవంతుడా అని నిట్టూర్చి, వెనక్కి వాలి కళ్ళు మూసు కున్నారు.

కాస్సేపటికి నిబ్బరం తెచ్చుకున్నారు. ఓరగా సారథిని చూశారు.

సారథి బాగ్ కుదురుగా ఒళ్ళో పెట్టు కుని ఏదేకంగా బయటికి చూస్తున్నాడు.

మాస్టారు మందహాసం చేశారు.

ఆ ఆలోచన ఏమిటో? బహుశా తన కా ఉద్యోగం లభిస్తుందో, లేదనో?

సత్తెనపల్లి వచ్చేసింది. బస్సు ఆగింది. సారథి లేచి మాస్టారి చేతిలోని సంచీ అందుకున్నాడు. మాస్టారు ముందుకు నడిచారు. సారథి అనుసరిం చాడు.

"మీ రెక్కడికి వెళ్ళాలో చెప్పండి, మాస్టారూ! రిక్షా మాట్లాడతాను" అన్నాడు.

"రిక్షా ఎందుకోయ్. నడిచి వెడతాను" అంటూ జేబులోని అయిదు రూపాయల నోటు తీసి సారథి చేతి కిస్తూ, "దీన్ని మార్చుకు రావోయ్. మార్చి నీ డబ్బులు తీసుకో" అన్నారు. సారథికి ఆ నోటు చూడగానే తిరిగి బస్సులో సంఘటన గుర్తు కొచ్చి బాధ కలిగింది. "అక్క ర్లేదు! నా ఆస్తి ఏం తరిగి పోదు, మాస్టారూ. నన్ను ఆశీర్వదించండి చాలు, ఈ ఉద్యోగం రావాలని." వింతగా కళ్ళప గించి చూస్తున్న ప్రయాణీకులను లెక్క చేయకుండా సారథి మాస్టారి పాదాలు స్పృశించాడు.

మాస్టారి కంటినుండి నీటిబిందువులు రాలాయి. ఎండకు కమిలి వడ్లబారిన ఆ ముఖంలో వాత్సల్యం రేకులు విరిసింది. వణుకుతున్న చేతులతో సారథి భుజం తడిమి ముందుకు నడిచారు, కండువాతో కళ్ళు తుడుచుకుంటూ.

సారథి తేలికైన హృదయంతో అడుగులు వేశాడు. ఈ సారి అతనికి తప్పక ఉద్యోగం దొరుకుతుందని ఏదో నమ్మకం ఏర్పడింది.

* * *

కాలేజీ వరండాలో ఉన్న వ్యక్తుల్ని చూడగానే సారథి యథాప్రకారం నిరుత్సాహపడ్డాడు.

ఎవరెవరివో ఇంటర్వ్యూలు అయ్యాయి.

తన వంతు వచ్చింది. భారంగా నడిచాడు, లోపలికి.

ప్రిన్సిపల్ శేషయ్యగారు—"నువ్వే నేమిటోయ్ సారథివి?" అంటూ కొన్ని పద్యాలు ఇచ్చి వ్యాఖ్యానం చేయించి తృప్తి పడ్డారు.

కళ్ళజోడు సర్దుకుని నవ్వుతూ, "బాగుందోయ్. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి శిష్యుడ వనిపించావు. తన పాండిత్యానికి గీటురాయి లాటి వాడి వన్నారు నిన్ను" అన్నారు.

సారథి ఆశ్చర్యంతో చూశాడు ఆయన వైపు.

"ఆయన నా గురించి ఎప్పుడైనా మీకు చెప్పారాండీ?"

"అదేమిటోయ్! వారు నిన్న ఇక్కడికి వచ్చినట్లు నీకు తెలియదా? నువ్వు చాలా సమర్థుడివనీ, ఈ ఉద్యోగం తనకు కాదు, నీకు ఇమ్మని మరీ మరీ చెప్పారు. అసలు వారి కిద్దామనుకున్న ఉద్యోగం. . ." శేషయ్యగారు ఆగి మళ్ళీ అన్నారు: "మీ గురువుగారు అనడమే కాదు. నీ సమర్థత మాకు చూపాలి. ఆర్డరు త్వరలోనే పంపుతాము. వెళ్ళు" అన్నారు.

సారథి యాంత్రికంగా ఇవతలకు నడిచాడు.

'మాస్టారుకూడా ఇంటర్వ్యూకని బయలుదేరారా? మరి నాతో చెప్పలేదే? మాస్టారుకి అన్యాయం చేశాను. వారికి దక్కవలసిన ఉద్యోగం నేను దక్కించు కున్నాను. మాస్టారూ! నన్ను శపించారు, మాస్టారూ, మీరు."

అతని కళ్ళ వెంబడి నీళ్ళు ధార కట్టాయి. బరువుగా రోడ్డు మీదికి అడుగు లేశాడు. నడుస్తున్న అతనికి రోడ్డు పక్కన ఉన్న వీధి బడిలోంచి వినిపించింది — ". . . పితృదేవో భవ, ఆచార్యదేవో భవ!"

సారథి కన్నీళ్ళతోనే చేతులు జోడించాడు. ★

---

# అన్నా! నూతలపాటీ!

## పాయసం సుబ్రహ్మణ్యం

అన్నా! నూతలపాటీ!
నీవు లేని సాహితీవనం
ఎడారిలా కనిపిస్తున్నది.
నీవు లేని ఈ గృహం
బోసిపోయిన ట్లున్నది.
నీవు లేని కవితాగోష్ఠులన్నీ
కోయిల పాట లేని
వసంతంలా ఉన్నాయి.
చిరంజీవివై ఎన్నాళ్ళో
మాతో నివసిస్తావని
మేము కన్న కలలన్నిటినీ
ఘోరంగా తుడిచివేసింది విధి
అర్ధరాత్రి నిజంగా
కాలనాగై కాటేసింది ఎదలేని విధి.
నిన్నటివరకూ నవ్వుతూ కనిపించిన నీవు
నిన్నటివరకు వేదికలపై
సింహంలా గర్జించిన నీవు
ఈ దినం మా నుండి
విడిపోయావంటేనేను నమ్మలేను!
అడుగో నీవు
నాతో నడుస్తున్నట్లే ఉంది.
మాట్లాడుతున్నట్లే ఉంది.
అన్నా! గంగాధరం!
నీ చితిమంటలు ఆరినా
నా గుండె మంటలు చల్లారవు!
నీ కవితలోని నీ రూపాన్ని దర్శిస్తూ
నీతో సంభాషిస్తాను!
నిత్యం మందహాసం చేసే నీ రూపాన్ని
నా గుండె అరలో పదిలపరచుకొంటాను!

(సుప్రసిద్ధ కవి, రచయిత నూతల పాటి గంగాధరం మరణవార్త విని) ★